క్లుప్తంగా

సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: నగరంలో ఆగస్టు 17,18 తేదీలలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలును జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం కోటి వీరాంజనేయులు అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలి రోజు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. నగర కార్యదర్శి అరుణ్ కుమార్, అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో మంగమ్మ కోటేశ్వరరావు,బాలయ్య, సద్గుణ రావు,రాజా, ఆదినారాయణ బసవమ్మ లక్ష్మి,బుజ్జి మేరీ శ్రీను డేవిడ్, దానియేలు వీరయ్య బాలు నాయక్ పూర్ణ పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిర్‌కు వాటర్ కూలర్ బహూకరణ



కొరిటిపాడు(గుంటూరు): పాత గుంటూరులోని సరస్వతి శిశు మందిర్ స్కూల్ విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)లో పనిచేసి రిటైర్ అయిన రవికుమార్ గురువారం స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. అలాగే యూబీఐలో రిటైర్ అయిన కొంతమంది ఉద్యోగులు కలిసి వాటర్ కూలర్ బహూకరించారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు ఎం.శ్రీనివాసరావు, ఐఎస్ఎస్ మూర్తి, రామకృష్ణ, చెన్నకేశవరావు, వై.శ్రీనివాసరావు, బాలపద్మజ పాల్గొన్నారు.

సాహిత్య జలపాతం విశ్వనాథ శాస్త్రి



లక్ష్మీపురం: మూడు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యంలో ఎన్నో మేలి పంటలు పండించిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనల నిండా సమాజ హృదయం ఉంటుందని, ఆయన సిసలైన ప్రజా రచయిత అని ప్రముఖ విశ్లేషకులు ఎ.అమరాచారి అన్నారు. గుంటూరు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సాహితీ వేత్త రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విశ్వనాథ శాస్త్రి సామాన్యుల వెతలనీ, వ్యధలనీ, గాధలనీ, బాధలనీ, ఆశల్ని అక్షర బద్ధం చేశారన్నారు. కళా సాధ అధ్యక్షుడు బిళ్ళా అశోక్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ రావిశాస్త్రి ఎప్పుడు జనంతో ఉంటారు, వాళ్లతో నిత్యం సంభాషిస్తూ ఉంటారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు: 11 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని గుంటూరుటౌన్ -2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉద్యోగ నగర్, ఎస్వీఎన్ కాలనీ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. 11కేవీ చంద్రమౌళి నగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలిగించుట, లైన్ మెయింటనెన్స్‌లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు చంద్రమౌళి నగర్, బీఆర్ స్టేడియం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఉండదని చెప్పారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

నగరంపాలెం: దేవస్థానం కార్యదర్శిపై దాడికి పాల్పడిన వారిపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పాతగుంటూరు నందివెలుగు రోడ్డు వస్తనగర్ సొసైటీలో వి.కోటిరెడ్డి, ఎం.సాలారెడ్డి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వెనుక నివసిస్తున్నారు. ఇద్దరు దేవస్థానం కార్యదర్శి శేషగిరిరావుకు ఫోన్ చేసి, రహదారులు అధ్వానంగా ఉన్నాయని మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ విషయమై బుధవారం దేవస్థానంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఇద్దరిపై దేవస్థానం కార్యదర్శి ఎంబీ శేషగిరిరావు పాతగుంటూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాతగుంటూరు పీఎస్ ఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో సెమినార్

గుంటూరు రూరల్: వ్యర్థాల రీసైక్లింగ్ విధానంలో సాంకేతిక ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ఆలోచనలు చేయాలని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ మేనేజర్ పి రవిశంకర్ తెలిపారు. గురువారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో సాల్వేజ్ ఆఫ్ మునిసిపల్ సాలిడ్ వేస్ట్ ఇన్ ఇండియా అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జె.మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊపిరితిత్తులు.. జరభద్రం

నేడు వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే

- పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు
- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలి
- పొగతాగని వారికి క్యాన్సర్
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



గుంటూరు మెడికల్: ఊపిరితిత్తులకు క్యాన్సర్లు మనిషిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆధునిక జీవనశైలి మార్పులు వచ్చాయి. పచ్చదనం తగ్గిపోవడం పారిశ్రామికరణ పెరిగిపోవడంతో క్యాన్సర్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ క్యాన్సర్‌ను వైద్య నిపుణులు సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2012 నివేదిక ప్రకారం 18లక్షల మంది ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి బారిన పడగా, వారిలో సుమారు 16 లక్షల మంది చనిపోయారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలు వ్యాధి బారిన పడకుండా ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాధికి కారణాలు...

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. సిగిరెట్లు, హుక్కా, గంజాయి పీల్చటం లంగ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకిన వారిలో నూటికి 90 శాతం మంది పొగాకు వినియోగం వలన క్యాన్సర్ బారిన పడ్డారు. సాధారణ వ్యక్తితో పోల్చితే పొగతాగే వారిలో క్యాన్సర్ రావటానికి 2.5శాతం రెట్లు ఎక్కువ. కాలుష్య పొగల కారణంగా, వాహనాల కాలుష్యం వల్ల,రేడియేషన్ వలన, వాతావరణ కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

వీరికి ఎక్కువగా...

పొగతాగేవారి కంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. మహిళలు, పిల్లలు ఈ బాధితులే. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారురోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనేవారికి ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నట్లు వైద్య నివేదికలు తెలియజేస్తున్నాయి ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సరే కాకుండా శరీరంలోని ఇతర అవయవాలకు క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ధూమపానం చేసేవారితోపాటు వారి పక్కన ఉండే కుటుంబ సభ్యులు ఎక్కువ శాతం క్యాన్సర్‌బారిన పడుతున్నారు. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65 శాతం మంది మహిళలు, 35 శాతం మంది పురుషులు ఉన్నారు.

జిల్లాలో బాధితులు...

జిల్లాలో 30 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు నెలలో ఇరువురు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి



ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.

–డాక్టర్ భైరవనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునికవైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ముందస్తుగా వ్యాధి నిర్ధారణ చేయటంతోపాటుగా శస్త్రచికిత్సల్లో ఆధునిక సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుంది. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. గతంలో క్యాన్సర్లు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్నవారిలో వచ్చేవి. నేడు 30 ఏళ్లకే క్యాన్సర్లు రావడం చాలా బాధాకరం.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి



పలువురు వ్యాధి నిర్ధారణ సకాలంలో చేయించుకోవడం లేదు. వ్యాధి నిర్ధారణ చేసే సమయానికి క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు గుర్తిస్తున్నాం. దీని వల్ల వైద్యం చేసినా ఎలాంటి ఉపయోగం లభించదు. ఎక్కువ రోజులు దగ్గు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

మోసం చేయడంలో చంద్రబాబు నంబర్ వన్



చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తున్న నూరి ఫాతిమా

నెహ్రూనగర్: అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు నంబర్ వన్ అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. 14వ వార్డులో ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసి వారి జీవితాల్లో చిరునవ్వులు పూయించారన్నారు. ఈనాడు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సంవత్సరానికి కూడా సంక్షేమ పథకాలు సక్రమంగా అందించని పరిస్థితి నెలకొందన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి డబ్బులు వేస్తామని చెప్పి.. ఇప్పుడు అరకొరగా డబ్బులు వేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించి దానికి కూడా ఆంక్షలతో తూట్లు పొడిచే కార్యక్రమానికి తెర తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సంవత్సరం పాలనలో ప్రజలను ముప్ప తిప్పలు పెట్టి వారిని అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను అవస్థలకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారంటూ ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ నజీర్ పాల్గొన్నారు.

ఆగస్టు 5న ధర్నాను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



స్మార్ట్‌మీటర్‌లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: ఆగస్టు 5న లిబర్టీ థియేటర్ ఎదురుగా ఉన్నటువంటి విద్యుత్ కేంద్రం వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు నగరంలోని విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఆగస్టు 5న శారదకాలనీ, వెంగళరావు నగర్, బొంగరాలబీడు, అశోక్‌నగర్, దేవాపురం, కోబాల్ట్‌పేట, బ్రాడీపేట తదితర ప్రాంతాలలో ప్రజా అవగాహన ర్యాలీలను నిర్వహించి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఉన్నటువంటి అన్ని ప్రాంతాలలోని ప్రజలను కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి గౌతమ్ అదానీ అనుకూల విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నగర కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ విద్యుత్ మీటర్లను బిగించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదని, విద్యుత్ శాఖ అధికారులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బలవంతంగా మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తే ప్రజలు తిరగబడాలని వారు పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి



ఉద్యోగ విరమణ పొందిన వారితో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ఉద్యోగ విరమణ పొందిన ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. ఎస్ఐలు ఆర్.మోహన విజయకుమార్, వి.నాగరాజేశ్వరిదేవి, ఏఎస్ఐలు ఎస్.భగవంతరావు, ఎన్.కొండలరావు, హెడ్ కానిస్టేబుళ్లు వి.పోలయ్య(ఏఆర్), వై.రాంబాబు (సివిల్) ఉద్యోగ విర మణ పొందగా, నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో గురువారం సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన అధికారుల సేవలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ(ఏఆర్) ఎ.హనుమంతు, డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైల సాంబశివరావు పాల్గొన్నారు.

బాలల న్యాయం కోసం పటిష్ట భారత రాజ్యాంగం

ప్రైవేటు న్యాయ బోధనా సంస్థ డైరెక్టర్ శిరీషరెడ్డి



శిరీషరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

పెదకాకాని(ఏఎన్‌యూ): భారత రాజ్యాంగం బాలల న్యాయవ్యవస్థ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని ప్రైవేటు న్యాయ బోధనా సంస్థ డైరెక్టర్ శిరీషరెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విభాగంలో గురువారం భారత రాజ్యాంగం–జువెనైల్ జస్టిస్ అనే అంశంపై ఎల్ఎల్‌బీ హానర్స్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షురాలు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోనే ఎన్నో అంశాలు పేర్కొనబడి ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. అందులో భాగంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15,21, 24 ,39 (ఇ)(ఎఫ్) అలాగే 45 47 లలో పొందుపరిచిన అంశాల ద్వారా బాలలకు ఎన్నో హక్కులు రక్షణ సూత్రాలు పేర్కొనబడ్డాయన్నారు. వక్తగా విచ్చేసిన శిరీషరెడ్డి మాట్లాడుతూ నిర్దిష్ట వయసు కన్నా తక్కువ వయసు గల పిల్లలు నేరం చేయడానికి అసమర్థులని డోలి ఇంకా పార్క్స్ అనే సూత్రం స్పష్టం చేస్తుందన్నారు. వీటితో పాటు బాలల న్యాయం, భారత రాజ్యాంగానికి సంబంధించి ఎన్నో పాఠ్యాంశాలను విద్యార్థులకు శిరీష రెడ్డి వివరించారు. చివరగా విభాగాధిపతి డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, ఇతర అధ్యాపకులు అతిథిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ చెన్నం సతీష్ , డాక్టర్ ఘంటా సతీష్ కుమార్, డాక్టర్ కే శివరాం, పరుచూరి కుమారి, డాక్టర్ జ్యోతి సంపూర్ణ ,అభిలాష్ గోపీనాథన్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాగ్గేయకారుల ఆధ్యాత్మిక ప్రసంగం



సత్కారం పొందిన కళాకారులతో నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న సంగీత నృత్యోత్సవాలు గురువారం రెండో రోజుకి చేరాయి. శ్రీదాస సాహిత్య ప్రాజెక్ట్, టీటీడీ, శ్రీకంచి కామకోటి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం(గుంటూరు) ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ న్యూఢిల్లీ(తిరుపతి రీజియన్), ద్వారం లక్ష్మి అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్(తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో జరగ్గా, సంస్థలు, ఆలయ పాలక మండలి సభ్యులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. వాగ్గేయకారుల భక్తి వైభవంపై వాచస్పతి ముప్పవరపు వెంకటసింహాచలశాస్త్రి ధార్మికోపన్యాసం చేయగా, భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భువనేశ్వరి బృందం (బెజవాడ) శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై బి.సురేష్‌బాబు చక్కటి వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను సంస్థ కార్యదర్శి వెంకటరమణ సత్కరించారు.

శౌచాలయ అభివృద్ధికి రూ.3.80 లక్షల వితరణ



జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి నమూనా చెక్కును అందిస్తున్న బ్యాంకు అధికారులు

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్‌లోని శౌచాలయ అభివృద్ధికి ఏపీ గ్రామీణ బ్యాంకు రూ.3.80 లక్షల చెక్కును గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మొత్తాన్ని కలెక్టరేట్‌లోని మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించనున్నట్లు చెప్పారు. కార్పొరేట్ సంస్థలు విరాళాలు అందిచడం ద్వారా పేద ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. శౌచాలయ అభివృద్ధికి నిధులు అందించిన గ్రామీణ బ్యాంకు యాజమాన్ని కలెక్టర్ అభినందించారు. సమాజ సేవలో తమను భాగం చేసిన కలెక్టర్‌కు బ్యాంకు జనరల్ మేనేజర్ హరీష్ బేతా, బ్రాంచ్ మేనేజర్ వాసుదేవ కుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రత్న మహీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

చదరంగం వేదికపై సరికొత్త అధ్యాయం దివ్య దేశ్ ముఖ్

లక్ష్మీపురం: అంతర్జాతీయ మహిళల చెస్ పోటీలలో చాంపియన్‌గా అవతరించి 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని అవగాహన సంస్థ అభినందనలు తెలుపుతుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం అభినందన సభ నిర్వహించారు.

నేటి నుంచి ఆస్తి పన్ను బదలాయింపు సులభతరం

- ఇక నేరుగా ఆటో మ్యూటేషన్
- కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరిగే పనిలేదు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తుల అమ్మకాలు జరిగినప్పుడు సదరు ఆస్తిపై పన్ను పేరును కొన్న వ్యక్తి మీద బదలాయింపు(అర్బన్ ఆటో మ్యూటేషన్) జరగాలంటే కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. నెలల తరబడి ఆటో మ్యూటేషన్ కోసం తిరుగుతూ ఉండాలి. వీటిన్నంటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆగస్టు ఒకటి నుంచి నగరపాలక సంస్థకు చెందిన ఈఆర్‌పీ(ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్) డేటా సర్వర్ రిజిస్ట్రేషన్ శాఖతో అనుసంధానమై రిజిస్ట్రేషన్‌తో పాటే ఆటోమేటింగ్‌గా పన్ను బదలాయింపు చేయనున్నారు.

ఎన్ని అసెస్‌మెంట్లు అంటే..

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 2,04,657 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి సంబంధించి ఆస్తుల అమ్మకాలు జరిపినప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన ఆటో మ్యూటేషన్ కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో సంబంధిత రిజిస్టర్ డాక్యుమెంట్లు, ఇతర డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలోనే రిజిస్ట్రేషన్ వాల్యూపై 0.5 పర్సంటేజ్ అంటే లక్షకు రూ.500 మ్యూటేషన్ చార్జీలు కార్పొరేషన్‌కు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తును ఆర్, ఆర్వో, డెప్యూటీ కమిషనర్, అడిషనల్ కమిషనర్, కమిషనర్ లాగిన్‌లోకి వెళ్లిన తరువాత వారు ఓకే చేస్తే అప్పుడు ఆటో మ్యూటేషన్ జరుగుతుంది. కాని ఇప్పుడు కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చే పనిలేకుండా మ్యూటేషన్ చార్జీలు కూడా రిజిస్ట్రేషన్ శాఖకు చెల్లిస్తే ఆటోమేటిగ్ రిజిస్ట్రేషన్‌తో పాటు పన్ను బదలాయింపు కూడా జరిగిపోతుంది.

ఖాళీ స్థలాలకు పన్నులు

నగరంలో లక్షల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. కాని నగరపాలక సంస్థ పరిధిలో కేవలం 8,279 కి మాత్రమే ఖాళీ స్థల పన్నులు ఉన్నాయి. సదరు ఖాళీ స్థలాలకు పన్నులు వేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రయత్నించినా స్థల యాజమానులు విదేశాల్లో ఉండటం, అందుబాటులో లేకపోవడంతో వాటికి పన్ను వేయడానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది. ఈ నూతన విధానం ద్వారా ఖాళీ స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేటప్పుడు ఆటోమేటిక్ ఒక యూనిక్ నంబర్ జనరేట్ అవుతుంది. ఆ నంబర్ కార్పొరేషన్ అధికారులకు డాక్యుమెంట్స్‌తో వెళుతుంది. కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు సదరు ఖాళీ స్థలానికి పన్ను వేసేందుకు అవకాశం ఉంది.

చుట్టూ తిరిగే పని ఉండదు

ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ ఆటో మ్యూటేషన్ కార్యక్రమం ద్వారా ఆస్తి అమ్మకాలు, కొనుగోలు జరిగిన వెంటనే పన్ను బదలాయింపు జరుగుతుంది. అందుగాను నగరపాలక సంస్థ ఈఆర్‌పీ సిస్టం, రిజిస్ట్రేషన్ శాఖతో అనుసంధానం అయింది. రిజిస్ట్రేషన్ జరిగేటప్పుడు పన్ను బకాయిలు మొత్తం కట్టేసినట్లయితే మ్యూటేషన్ ఛార్జీస్ చెల్లించి ఆటో మేటిక్‌గా నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరిగే పని లేకుండా పన్ను బదలాయింపు జరగుతుంది.

– చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

నేడు ముగియనున్న స్టేడియం నామినేషన్ల గడువు

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు గురువారం 12 నామినేషన్లు వచ్చాయని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. ఆగస్టు ఒకటి వరకు పాలకవర్గ ఎన్నికల నామినేషన్లు స్వీకరణ జరుగుతున్నాయని చెప్పారు. జూలై 30న వివిధ పదవులకు 5 నామినేషన్లు వచ్చాయన్నారు. జూలై 31న 12 నామినేషన్లు వచ్చాయని వాటిలో వైస్ ప్రెసిడెంట్‌కి 2 నామినేషన్లు, సెక్రటరీకి 2 నామినేషన్లు, జాయింట్ సెక్రటరీకి 2 నామినేషన్లు, ట్రెజరర్ 1 నామినేషన్, ఎగ్జిక్యూటివ్ బాడి మెంబర్స్ పురుషుల నుంచి 4 నామినేషన్లు, ఎగ్జిక్యూటివ్ బాడిమెంబర్స్ మహిళల నుంచి 1 నామినేషన్లు వచ్చినట్లు వివరించారు. ఈ రెండు రోజుల్లో 17 నామినేషన్లు వచ్చాయన్ని నేటితో నామినేషన్ల ప్రక్రియ ముగియనుందని చెప్పారు.

చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ



నగరంపాలెం: ఆంధ్రా సొవర్తిక లూథరన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఈఎల్‌సీ ప్రధాన కార్యాలయంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఏఈఎల్‌సీ సంఘ స్థాపకుడైన రెవ.డాక్టర్ జాన్‌క్రిస్టియన్ ఫ్రెడిరిక్ హైయర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఏఈఎల్‌సీ పరిపాలనా అధికారి, విశ్రాంత న్యాయమూర్తి జోసెఫ్ పి.ఎస్, విశ్రాంత న్యాయమూర్తి ఎస్.జేసురత్నకుమార్ ప్రసంగించారు. ఫాదర్ హైయర్, మిషనరీస్ ఆంధ్రప్రదేశ్‌లో ఏఈఎల్‌సీ సంఘం ద్వారా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, సొవర్తిక సేవలను వివరించారు. తద్వారా జరిగిన హితోధిమైన అభివృద్ధిని తెలిపారు. అనంతరం ఏఈఎల్‌సీ ట్రినిటీ లూథరన్ సంఘ (కుగ్లర్ హాస్పిటల్) ప్రతినిధులు గ్రేస్‌సుదర్శనం, రెవ.జి.దైవఆశీర్వాదం, బత్తుల లెనిన్ సహకారంతో యాభై మంది హెచ్ఐవీ పిల్లలకు నెలకు సరిపడా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.